పల్లవించిన 'నవ వసంత' రాగం

- వాడవాడలా ఉగాది సందడి
- ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ
- పలు ప్రాంతాల్లో పంచాంగ శ్రవణాలు


చందన అలంకరణలో తిరుమల బాలాజీ

గాజువాక: నవ వసంత ఆగమన వేళ అంతటా పండగ వాతావరణం నెలకొంది. శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని వేడుకలను వైభవంగా నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని సేవించి, ఆలయాలను దర్శించారు. పలు ప్రాంతాల్లో పంచాంగ శ్రవణాలు ఆసక్తికరంగా సాగాయి. ఆగమ పండితుల సారథ్యంలో పలుచోట్ల నిర్వహించిన ఈ కార్యక్రమాల సందర్భంగా తెలుగు సంవత్సరంలో ఆదాయం, ఖర్చు, రాజపూజ్యం, అవమానం, పదోన్నతులు, రానున్న పరిస్థితులపై విశ్లేషించారు. రానున్న ఎన్నికల్లో జయాపజయాలపై వివిధ పార్టీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పండితులు విశ్లేషణలు చేశారు. ఉగాది సందర్భంగా పలు చోట్ల కవిసమ్మేళనాలు హృద్యంగా సాగాయి. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఉగాది పచ్చడి, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.


ఉక్కు వేంకటేశ్వర ఆలయంలో పంచాంగం పఠిస్తున్న భాస్కరభట్ల సత్య ప్రసాద శర్మ

ఉక్కు నగరానికి ఉగాది శోభ

ఉక్కునగరం: తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలను ఉక్కునగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కళాక్షేత్రాలు ఉగాది పంచాంగ పఠనం, కవి సమ్మేళనాలతో కళకళలాడాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు భావనారాయణ, అర్చకులు హరినారాయణ, సత్యనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భాస్కరభట్ల సత్య ప్రసాదశర్మ నేతృత్వంలో పంచాంగ శ్రవణం జరిగింది. అయ్యప్పస్వామి ఆలయంలో ప్రధానార్చకులు నాగేశ్వర శర్మ నేతృత్వంలో గణపతి హోమం, అయ్యప్పకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

- త్రిశక్తి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాదుర్గా, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం పంచామృత సహిత నవరసాభిషేకాల అనంతరం అమ్మవార్లకు చందనాలంకరణ చేశారు. సహస్ర పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన జరిగాయి. సాయంత్రం నవచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలను స్టీల్‌ప్లాంట్ జీఎంలు ఎం. మధుసూదనరావు, పి.ఎస్.రావు ప్రారంభించారు. ప్రముఖ పండితులు రామకృష్ణ పంచాంగాన్ని పఠించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కళాక్షేత్రం ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉక్కు త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో మంగళవారం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రెక్టార్ డాక్టర్ వి.మధుసూదనరావు ఉగాది పండగ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్ విజ్ఞాన్ ఆడపడుచులకు తాంబూలం అందజేశారు. అధ్యాపకులను కండువాలతో సత్కరించారు.

వెండి గిన్నెల్లో ప్రసాద నివేదన

స్థానిక శాంతినగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి 108 వెండి గిన్నెలతో ప్రసాదం సమర్పించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈ.కె. చారి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు సాయిబునాయుడు, కృష్ణారావు, గుర్నాథ్, సోమశేఖర్, ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వేడుకలు
ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పెదగంట్యాడ: వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉదయం 6 గంటలకు పంచాంగ శ్రవణం చేశారు.


అగనంపూడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వెండి పాత్రల్లో సమర్పించిన నైవేద్యం

సంకట మోచన గణపతి ఆలయంలో..

76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పంచాంగ శ్రవణం చేశారు.

- నడుపూరు ప్రధాన రహదారిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు.
- హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలశెట్టి, త్రిమూర్తులు పాల్గొన్నారు.
- పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ట్రస్ట్ సెక్రటరీ మీసాల శివగణేశ్వరరావు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి విశాఖపట్నం మాజీ కో–ఆర్డినేటర్ కేఎస్ఎన్ రాజు, మేనేజింగ్ ట్రస్టీ రేవతీదేవి పాల్గొన్నారు. వీరికి ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వర్మరాజు, వనిత, దేవిక, అప్పలరాజు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.


పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం


పెద నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో..


విజ్ఞాన్ కళాశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న యాజమాన్యం

చందన తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: తిరుమల బాలాజీ చందన అలంకరణలో దర్శనమిచ్చారు. షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలో ఉగాది పచ్చడి వితరణ చేశారు. పంచాంగ శ్రవణం జరిగింది. సాయంత్రం దేవేరులతో కలసి స్వామివారి ఊరేగింపు వైభవంగా సాగింది.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జానకీ దేవి

అగనంపూడి: ఉగాది సందర్భంగా 79వ వార్డు అగనంపూడిలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కన చిత్తా రామారావు సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితి అధ్యక్షురాలు చిత్తా జనకీ దేవి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూర్ణానంద శర్మ, గ్రామ పెద్ద, వీఎస్‌పీటీఎన్‌టీ యూసీ అధ్యక్షులు కర్ణ సత్యారావు, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, నెల్లి తులసి తదితరులు పాల్గొన్నారు.

బాల కళాకారులకు ప్రశంసా పత్రాలు


సర్టిఫికెట్లు అందుకున్న బాలబాలికలతో నిర్వాహకులు

స్టీల్‌ప్లాంట్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలబాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం స్టీల్‌ప్లాంట్ సీజీఎం యు.శ్రీధర్ చేతుల మీదుగా వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు పందిరి రాట


రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీరామ నవమి రాట మహోత్సవాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని రామాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకుని ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటాయని చెప్పారు. పూజా కార్యక్రమంలో గ్రామ నాయకులు అంగ శ్రీను, బొడ్డు వెంకటరమణ, కామాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


నవరాత్రుల్లో భాగంగా కలశస్థాపన చేసిన ఆహూతులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజతో ప్రారంభమైన ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆహుతులైన భక్తుల సమక్షంలో శ్రీమేరు మొదటి అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక మీద కలశ స్థాపన చేశారు.అనంతరం ఉత్సవ మూర్తి లలితాంబిక అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ గావించారు. లలితా సహస్రనామ పారాయణ, త్రిశతి,బాలా సహిత లలితా హోమం జరిపించారు. మధాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు


వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూజలు చేస్తున్న అమర్‌నాథ్


గుడివాడ అమర్‌నాథ్‌ను ఆశీర్వదిస్తున్న కామేశ్వర శర్మ

అక్కిరెడ్డిపాలెం: ఉగాది వేడుకలను గాజువాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పండితుడు నేరెళ్ల కామేశ్వర శర్మ క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని వినిపించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అఖండ విజయాన్ని సొంతం చేసుకుని, జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్ అఖండ విజయాన్ని సాధిస్తారన్నారు. అనంతరం కామేశ్వర శర్మ చేతుల మీదుగా ఉగాది పచ్చడిని అందరికీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, గాజువాక మాజీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు, రొంగలి జగన్నాధం, దిలీప్ కుమార్, ఈటి శ్యామలరావు, బోగాది సన్యాసిరావు, మానిటరింగ్ కమిటీ మెంబర్ కటికల కల్పన, మద్ది శంకర్ రెడ్డి, దొడ్డి కిరణ్, మొల్లి చిన్నా, మద్దాల అప్పారావు, రంబ నారాయణ మూర్తి, నాగిశెట్టి శ్రీను, మొదలవలస లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందే..


కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1153వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈ విధంగా ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

ప్రతీ ఆలయం.. ప్రత్యేకం

- ఉక్కు నగరంలో ఆధ్యాత్మిక పరిమళం
- ఆకట్టుకునేలా దేవాలయాల నిర్మాణం
- పూరీ ఆలయాన్ని తలపించేలా జగన్నాథుడి కోవెల
- శబరిమల రీతిలో అయ్యప్పస్వామి ఆలయం


అయ్యప్పస్వామి దేవాలయం


జగన్నాథుడి దేవాలయం


త్రిశక్తి దేవాలయం

ఉక్కునగరం: ఉక్కునగరం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. ఇక్కడి ప్రతీ ఆలయం నిర్మాణశైలి దేనికదే ప్రత్యేకమనిపించే రీతిలో ఉండటం విశేషం. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కోసం వీటిని నిర్మించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన, విభిన్న మతాలకు చెందిన ఉద్యోగుల విశ్వాసాలకు అనుగుణంగా వీటి నిర్మాణం జరిగింది. ఉద్యోగులు, ఆయా మతాలకు చెందిన పెద్దలు, సంస్థల విరాళాలతో ఈ ఆలయాలు రూపుదిద్దుకున్నాయి. నగరంలో లేని కొన్ని ప్రత్యేక ఆలయాలు కూడా ఉక్కు నగరంలో ఉండటంతో వీటిని సందర్శించే భక్తులు ఎక్కువే.

- సెక్టార్–1 సమీపంలోని కొండపై వేంకటేశ్వర స్వామి కొలువై ఉండగా, సెక్టార్–5లో ఉమా సహిత రామలింగేశ్వరుడిని ప్రతిష్టించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నిర్మాణంగా షిర్డీసాయి మందిరం సెక్టార్–8లో, పూరి జగన్నాథుడి ఆలయాన్ని పోలిన జగన్నాథుని దేవాలయం సెక్టార్–9 లో సుందరంగా నిర్మించారు.

టెంపుల్ స్ట్రీట్

ఉక్కునగరంలోని ఒక వీధిలో వరుసగా కాళీమాత, హనుమాన్, త్రిశక్తి, అయ్యప్ప ఆలయాలు ఉండటం విశేషం. ఇందులో శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఒకే మంటపంలో కొలువైన అరుదైన ఆలయంగా త్రిశక్తి ఆలయం ఖ్యాతి గాంచింది. శబరిమల అయ్యప్ప ఆలయాన్ని పోలిన అయ్యప్ప దేవాలయం మాలధారణలు, అంబలం పూజలకు కేంద్రంగా మారింది. ఎక్కడా లేని విధంగా ఆలయాలు ఒకే రహదారిలో ఉండటంతో ఈ రహదారికి టెంపుల్ స్ట్రీట్ అని నామకరణం చేసారు. అదేవిధంగా సత్యసాయి భక్తుల కోసం సెక్టార్–1లోని సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రం, సెక్టార్–12లో దుర్గాదేవి తొమ్మిది అవతారాలతో కూడిన నవదుర్గ ఆలయం, సెక్టార్–5లో మరిడిమాంబ ఆలయాలు నిత్యం పూజలందుకుంటూ ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లుతున్నాయి.


వేంకటేశ్వర స్వామి దేవాలయం


సత్యసాయి మందిరం

ఒడిశాలోనే ఉన్న ఫీలింగ్



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని జగన్నాథ స్వామి ఆలయం అచ్చం పూరి జగన్నాథస్వామి ఆలయంలా ఉంటుంది. అక్కడ చేసినట్లే పూజాకార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. తొమ్మిది రోజుల రథయాత్ర, ఆలయ ఆవరణలో ఆ 9 రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఒడిశా ఎగ్జిబిషన్ చూస్తుంటే పూరీలో ఉన్నట్టే ఉంటుంది.

– దిలీప్ బెహరా, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

ఆధ్యాత్మిక సమ్మేళనం



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సర్వమత సమ్మేళనంగా ఉంటుంది. హిందువులు, క్రైస్తవులు, ముస్లింలకు చెందిన ఆలయాలు ఉన్నాయి. నిత్యం పూజా కార్యక్రమాలు కొనసాగుతూ ఉంటాయి. అవే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతున్నాయనే భావన కలుగుతుంది. అన్ని ఆలయాల కమిటీల మధ్య సమన్వయం ఉండటం కూడా మంచి వాతావరణాన్ని సూచిస్తుంది.

– ఎస్. రమేష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

నృసింహుడికి విశేష పూజలు


నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

- శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
- వైభవంగా గరుడసేవ

సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- స్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి, అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పండగల నిర్వహణపై సమీక్ష


అక్కిరెడ్డిపాలెం: శ్రీ రామనవమి వేడుకలను, తుంగ్లాం గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు 69వ వార్డు గ్రామ నాయకులు తెలిపారు. పండగల నిర్వహణకు సంబంధించి తుంగ్లాంలోని విజయ రాఘవ స్వామి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడారు. గ్రామంలో పండగలను గ్రామ పెద్దలు, యువత సమష్టిగా నిర్వహించి, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గ్రామ పెద్దలు కొల్లి అప్పల రెడ్డి, నామాన సింహాచలం, పెట్ల అర్జున, పట్నాల ప్రసాద్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే చిత్రం ముహూర్తం షాట్ చిత్రీకరణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో మంగళవారం ఫ్రైడే మూవీ ముహూర్తం షాట్ తీశారు. గణేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈశ్వర్ దూలిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్, వర్మ కంబాల నిర్మాత, సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న చిత్రం ముహూర్తం షాట్‌ను ఉక్కు నగరం జగన్నాథస్వామి ఆలయం వద్ద తీశారు. లీడర్ దినపత్రిక అధినేత వి.వి.రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మాత, సహ నిర్మాతలు క్లాప్ కొట్టగా మరో డైరెక్టర్ యాద్ కుమార్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు ఈశ్వర్, కథానాయిక దియారాజ్ మాట్లాడుతూ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నామన్నారు. చిత్రానికి రాజ్ మరియన్ కథ అందించగా పృథ్వీ ఛాయాగ్రహకునిగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జబర్దస్త్ సుధాకర్, ఫణిస్వామి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


ముహూర్తం షాట్‌కు క్లాప్ కొడుతున్న నిర్మాత

సంగీత సమితి ప్రారంభం


సంగీత సంస్థను ప్రారంభిస్తున్న ప్రసాద్

సీతంపేట: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి పేరిట నూతన సంగీత సంస్థ శంకరమఠంలో ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ జ్యోతిని వెలిగించి నూతన సంగీత సంస్థను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా శాస్త్రీయ సంగీత వైభవానికి స్వర్గీయ ఐవీఎల్ శాస్త్రి చేసిన మహోన్నత సేవలను కొనియాడారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ సంగీత జనకులం అనే సంగీత పాఠశాలనుస్థాపించి వందలాది మందికి శాస్త్రీయ సంగీతంపై చక్కని అవగాహన కల్పించిన ఘనత ఐవీఎల్ శాస్త్రికే దక్కుతుందన్నారు. సంగీత కళాకారులు పి.గోపాలరావు, కె.సరస్వతి విద్యార్థి, వి.వి.రమణమూర్తి, డి.త్యాగరాజు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, వి.వి.బి. శంకరం పాల్గొని ఐవీఎల్ శాస్త్రి సంగీత సేవలను కొనియాడారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి గౌరవాధ్యక్షులు ఐ.రామచంద్రమూర్తి, అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు, కార్యదర్శి పి.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి జి.మధుబాబు, సంగీత సంస్థ శిష్య బృందం పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు మిందిలో గ్రామానికి చెందిన పుప్పాల సురేష్, చింతా కామినాయుడు, వాకపల్లి శేఖర్, పుప్పాల గిరి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పల రామ్మూర్తి ప్రారంభించారు.


మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుడివాడ అప్పలరామ్మూర్తి